తలుపు కిరకిర

[కథానిక]

✻

= శ్రీ కపిలకాశీపతి =

"చిన్నమ్మా, ఎవరే ఆతలుపు తీస్తోంటారు?"

"ఏ తలుపమ్మగారూ?"

"ఆ దిక్కుమాలిన తలుపే, ఆ గదిదీ."

"పెద్దమ్మగారి గదితలుపేనా?"

"ఆ, పెద్దమ్మదే, వెధవతలుపు, కిరకిరలాడుతూ, ఎందుకే, అల్లా తీస్తావూ? అని తియ్యకూడదే."

"నే నిక్కడుంటే ఆ తలు పెవరు తీశారమ్మగారూ? మీరు నామీద కూకలేస్తారు!"

"కూకలేమిటే, కిరకిరలాడుతూ, తలుపు తీస్తోంటేనూ!"

"ఎంత పెద్దొట్టు పడితే అంత పెద్దొట్టమ్మగారూ. నే సాధరిమోనా పోలేదండీ. మరి మీ రే తలుపుచప్పుడిన్నారోనూ."

"శుభ్రంగా వినబడుతోంటే, తలుపు బలవంతంగా తీసినట్టు. నువ్వు కాకపోతే నేను తీశానా! ఇంట్లో మూడోమనిషన్నా లేరాయె."

"ఏమోనమ్మా, మీరన్నీ గాల్లోకబుర్లింటారు."

శాంత పడగ్గదిలోంచి ఇవతలి కొచ్చి, వరండా దాటి ఎదురుగుండా వున్న మూసిన గదితలుపు దగ్గిర నుంచుని పరీక్షిస్తోంది. ఆ గది ప్రస్తుతం మూసివెయ్యబడింది. నెలరోజుల్నించి. అదివరకు పదేళ్లు ఆ తలుపు రాత్రింబగళ్లూ తెరిచేవుండేది. బూజు దులపడానికి కూడా ఎప్పుడన్నా అటూ ఇటూ కదిల్చిన జ్ఞాపకం కూడా శాంతకి లేదు. నాలుగు కిటికీలూ తెరుచుకుని, తలుపు బార్లా తీసుకుని, గదిమధ్య మంచంమీద పక్కేసుకుని పడుకునేది ఆవిడ. పెద్దమ్మగారు. శాంత అత్తగారు. పోయి సరిగ్గా నెలరోజులైంది. చెడ్డనక్షత్రం కావడంవల్ల ఆగది ప్రస్తుతం మూసెయ్యవలసి వొచ్చింది. అందుకు శాంతకి విచారం లేదు. మూసేసివుంచడమే ఆవిడ ఉద్దేశ్యం. ఆ గది ఎందుకూ వుపయోగించాలని ఆవిడికిలేదు. అసలు అత్తగారు పోయినందుకే విచారం లేదు. కేవలం తను కోడలూ, పోయినావిడ అత్తగారూ అనే సహజసంప్రదాయిక కారణంవల్లనే కాదు. శాంత కాపరాని కొచ్చి పదేళ్లయింది. ఇన్ని సంవత్సరాలూ అత్తగారు లేచి తిరగ్గా ఆవిడ బహిరంగంగా చూడలేదు. అంతా పడుకున్నతర్వాత ఆవిడ లేచి గదిలో పచారు చేస్తూవుండేవని శాంతకి తెలుసును. అది కేవలం వో నమ్మకం కాదు. చిన్నమ్మి చూసింది. తనకీ చూబించింది. అందరూ మేలుకుండగా ఎందుకు అల్లా పడుకుని వుండేవో. ఈ పడక ప్రారంభం, శాంత అత్తారింట్లో అడుగుపెట్టడం ఒక్కమాటే జరిగాయి. పునస్సంధానం తర్వాత మూడునిద్రలకి వొచ్చింది శాంత. బండి దిగి గుమ్మం ఎక్కుతోంటే చిన్నమ్మి కాళ్లుకడుక్కునేందుకు నీళ్లు తెచ్చియిచ్చింది. ఏవో ఎర్రనీళ్లు దిగదుడిచి పోసింది. అత్తగారుమాత్రం గదిలోంచి రాలేదు. చూస్తో పక్కమీదే కూచుంది. స్ఫురద్రూపి. పచ్చని శరీరం. నిండైన జుట్టు. పోయేదాకా కేశఖండన కాలేదు. మామగారు చిన్నప్పుడే పోయినా. మెళ్లో గొలుసు, దుద్దులు, ముక్కుపుడకా, చేతులికి సన్నటివి నాలుగు జతల గాజులూ, మల్లెపువ్వులాటి తెల్లని జరీనేతచీర— డవేజరురాణీలా వుండేది. తక్కిన వేషం అంతా ఎంత

కళకళలాడుతూవుందో, ఆ ముఖం అంత ధుమధుమ లాడుతోంది. చివరదాకా అల్లాగే వుండేది. అత్తగారి నవ్వు శాంత ఎరగదు. నవ్వితే అందంగానే వుండి వుండేది. అసలు ఆవిడ ఎప్పుడన్నా నవ్విందో లేదో! త నెరిగున్నంతవరకు సంధ్యారాగంలో నల్లని మబ్బులా వుండేది ఆమనిషి. ఎంతో శుభ్రం, షోకు, వొయ్యారం. నిజంగా భర్త వయసుతనంలో ఈవిణ్ణి విడిచిపెట్టలేక పోయివుండవచ్చు. ఆసుఖమైనా ఎన్నాళ్ళు? చిన్నతనం లోనే ఆయన వెళ్లిపోయారు. ఒక్క కొడుకునిమాత్రం తన పేరుమీదుగా ప్రసాదించి. రమణరావంటే తల్లికి ప్రాణం. తండ్రిపోయేసరికి రెండేళ్ళు. మళ్ళీ తండ్రి పోలికే. సరిగ్గా ఆయన నోట్లోంచి వూడిపడ్డాడు. ఆ కొడుకుని చూసుకుని బతికేదిట. మామగారు పోయిన పదోరోజుని ముసలమ్మలూ, ముసలయ్యలూ వొచ్చి కేశఖండనం కావాలంటే, ఆవిడ ససేమిరా అంది. "నా చిట్టితండ్రి నన్ను చూసి హడిలిపోతాడు. వాడికోసం నేను జీవించాలి. ఆ వికృతరూపంతో వాణ్ణి నేను పెంచదల్చుకోలే" దంది. అప్పట్నుంచీ ఒక్క పసుపూకుంకం తప్ప తక్కిన ఏ బహిరంగ అలంకారమూ ఆవిడ మానలేదు. గదిలో ఎప్పుడూ అగరొత్తులు వెలుగుతూవుండవలిసిందే. తల కెప్పుడూ అగరునూనే. గంధంసబ్బుతప్ప మరోటి పనికిరాదు. కాశ్మీరంనించి వొచ్చిన పునుగుసీసాలు బల్లమీద వుండేవి పచ్చకర్పూరంతో తాంబూలం వేసుకుంటే ఘుమఘుమ లాడిపోవలిసిందే. ఆ ఎర్రని పెదవులు పోయే వయసుని కప్పేసేవి. అంత అందగత్తెకి గర్వం వుండడం తప్పుకాదు. కానైతే సంతోషంగా ఎందు కుండగూడదని శాంత సందేహం. ఎప్పుడు తను చూసినా తుమ్మెల్లో పొద్దు కూకుతున్నట్టు వుండేది. ఒక్కగానొక్క కొడుకు. పోరూ పొక్కూ లేదు. పుట్టింటి దగ్గిర్నించి లేచివొచ్చి స్వయంగా, స్వతంత్రంగా పట్నంలో కాపరంబెట్టి, మగవాడికంటే ఎక్కువగా వ్యవహారాలన్నీ చక్కబెట్టుకుని, కొడుక్కి చక్కగా చదువుసంధ్యలు నేర్పించి, వో యింటివాణ్ణి చేసింది. తను స్వయంగా ఏరికోరి, ఎంతమందినో చూసి వెనకాముందూ ఎవరూ లేకపోయినా శాంతని మెచ్చుకుని ఇంటికోడలుగా చేసుకుంది. ఆ కోడలూ కొడుకూ సుఖంగా కాపురం చేస్తోంటే చూసి సంతోషించలేదా? ఏమిటీ ప్రకృతి అని శాంతకి శాశ్వతసందేహం.

శాంత మెట్లెక్కి లోపలి కెళ్లగానే, వెనకాల రమణరావు వొచ్చాడు. భార్యని తీసుకెళ్లి, దంపతి సహితంగా తల్లికి దణ్ణం పెట్టాడు. వెంటనే లేచి కావలించుకుంటుందేమో అనుకుంది శాంత. ఇంత సౌందర్యవతి, శుభ్రవతి, సమర్థురాలు, ఆపేక్షుమంతురాలు తనకి అత్తగారు కావడం తన పూర్వజన్మ పరిపాకం అనుకుంది, అత్తింటి కొత్తకోడలు శాంత.

అత్తగారటువంటి పని ఏమీ చెయ్యలేదు. వెంటనే బొడ్డులోంచి, వెండిగొలుసుకి వేలాడుతున్న తాళపుచేతులగుత్తి తీసి కొడుకుచేతులో పారేసి "నాయనా, నాఅధికారంఅయిపోయింది. ఛార్జీ వప్పజెప్పేస్తున్నాను. ఈ ఇంటికి యజమానురాలు ఇకమీద ఆవిడ. మీరూ మీరూ ఏం చేసుకుంటారో మీ యిష్టం" అంది.

శాంతగుండె గుభేలుమంది. రమణరావు బిక్క మొహం వేసి భార్యకేసి చూశాడు. ఆవిడ తలవొంచుకుని వుంది. అయినా తేరుకుని, "అదేమిటమ్మా, దానికేం తెలుసును? చిన్నపిల్ల! ఈ ఇల్లు ఇదివరకెల్లా జరుగుతోందో అల్లాగే జరగడం నా వుద్దేశ్యం. నీదే సర్వాధికారం."

"అనగానే సరా నాయనా! ఈ వేళ కాకపోతే, రేపైనా అప్పజెప్పగలసినదాన్నే. అంత్యనిష్ఠూరంకంటె ఆదినిష్ఠూరం మెరుగు. నా కేమీ పెత్తనం, పెడబొబ్బలూ వొద్దు నాయనా" అని కొంగు కంటికి జేర్చి ఏడవడం మొదలుపెట్టింది.

శాంతకి పంచప్రాణాలూ పైకి పోయాయి. చిన్నమ్మి వొచ్చి లోపలికి తీసుకెళ్లి, వేడినీళ్లు పోసి ముస్తాబు చేసింది.

తర్వాత తల్లీకొడుకూ ఏంమాట్లాడుకొన్నారో, ఆ రోజు మొదలు అత్తగారుపోయేదాకా తల్లీ, కొడుకూ తన యెదురుగుండా మాట్లాడుకోడం శాంత చూడలేదు. మాట్లాడుకోలేదని కాదు. మాట్లాడుకునేవారు. తనఎదు

రుగా మాత్రం వారు ఎప్పుడూ ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకోడం తనెరగదు.

రాత్రి వొంట్లో బాగుండలేదని అత్తగారు భోజనానికి రాలేదు. ఆ తర్వాత ఆవిడ పంక్తిభోజనం చెయ్యలేదు.

శాంత పడగ్గదిలో కుర్చీమీద కూచుని గోడమీద ఎదురుగా వున్న రమణరావు చిన్నతనం ఫోటోగ్రాఫులు చూస్తోంది.

తల్లి గదిలోంచి రమణరావు వొచ్చి, గది తలుపులు నెమ్మదిగా వేసి, శాంతపక్కని కుర్చీ చెయ్యిమీద కూచున్నాడు. శాంత ఏమీ మాట్లాడలేదు. అత్తగారి విపరీతస్వభావం సంగతే ఆవిడ ఆలోచిస్తోంది. అతను కూడా అదే ఆలోచిస్తున్నాడని ఆవిడకి తెలుసును. అతనికి తల్లిమీద ఎంతఅపేక్షో కూడా తెలుసును. "నాకు దేవుడూ, దెయ్యమూ కూడా ఆవిడే. ఈ లోకంలో ఆవిడకంటే నాకు ఎవరూ లేరు. తక్కినవారంతా ఆవిడతర్వాతనే" అన్నాడు. మొదటిరోజు పరిచయంలోనే. ఆ రోజునే తనకీ, ఆవిడకీ రమణారావు హృదయంలో వుండే తరతమాలు శాంత అర్థం చేసుకుంది. అవును. ఆశ్చర్యం ఏమిటి? చిన్నప్పట్నించీ పెంచింది. కన్నతల్లి కొడుకుకంటే ఆవిడకి మరెవరు? కొడుక్కి ఆ తల్లికంటె మరెవరు? కొత్తగా కాపురాని కొచ్చిన చిన్నతనంలో, కాపురంలో కష్టసుఖాలు వొంటికి పట్టని అర్థంకాని భయంతో కూడిన ఆ నూతన సంసారంలో ఆవిడకి ఈ విషయం గమనింపులోకి రాలేదు. క్రమేణా వయస్సు వృద్ధిఅయి, స్త్రీత్వం వికసించి, దాంతోపాటు భర్తఅంటే ఏమిటో పూర్తిగా తెలుసుకొని, అతనిమీద ఆపేక్ష కలిగి, అది అతిశయించి, తత్వం బోధపడేసరికి, శాంతకి పార్వతీదేవిలా అర్థనారీశ్వరం కావాలనిపించింది. కాని దీనికో పెద్ద ప్రతిబంధకం కలిగింది. ఆ ప్రతిబంధకమే అత్తగారు. శాంతకి అసూయ కలిగింది. అనుమానం కలిగింది. అత్తగారు తనకంటే అందంగా ఉండాలని ప్రయత్నిస్తోందా? ఉండనీ, వుంటే తనకేం? కాని తన భర్తకీ, నకీ మధ్య సంసారసుఖం పాకు చెయ్యడం ఎందుకు? పానకంలో పుడకలాగ ఈవిడెవరు? భర్తతల్లి. తల్లయితే తల్లిలావుండమను. చిన్నపిల్లవాడా పొత్తుల్లో పెంచడానికి? ఆయనకి స్వేచ్ఛ ఎందుకుఇవ్వదు? —ఇవే శాంత తెగని సమస్యలు. అసలు ఈ అనుమానమే ఆవిడకి కలిగేదికాదు; అత్తవారింట్లో తొలినాటి సంఘటన అంత విడ్డూర్యంగా లేకపోతే.

ఏవో రెండు మెతుకులు నోట్లో వేసుకుని భర్తా, తనూ గదిలో కూచున్నారు. అంతకిక్రితం మూడు నాలుగురోజులు జాగారంతో, బడలికతో, వేడినీళ్ళ స్నానంతో, అత్తగారి ఉదాసీనంతో నలిగి నల్లేరయిపోయిన ఆ ముగ్ధ ఈ కొత్త వాతావరణంలో పురుగులు కొరికి విడిగా గాలిలో వేలాడే తాటియాకులా రెపరెపలాడిపోతోంది. అత్తగారి విపరీత స్వభావం విషయం భర్తతో చర్చించడానికి వీలులేదు. అతని మనస్సులో బాధగా ఉందని తనకి తెలుసును. తన మనస్సులో బాధగావున్న సంగతి అతను గ్రహించాడు. పెద్దదైన తల్లిమీద ఆపేక్ష, గౌరవం, కొత్త భార్యమీద మమకారం, ముభావం, వీటిమధ్య ఆ కుర్రవాడుకూడా ఏం చెయ్యడానికీ తోచక, ఎల్లా పలకరించాలో పాలుపోక మెల్లిగా శాంతితల నిమురుతున్నాడు.

అప్పుడు సంభవించింది ఆ సంఘటన. బైట తలుపుదగ్గిర పెద్ద చప్పుడైంది. తలుపు ఎవరో శరీరం అంతా ప్రయోగించి దౌర్జన్యంగా తోసినట్లయింది. తీసేసరికి వరండాలో మూటకట్టినట్టు కుదేలబడివుంది అత్తగారు; ఒగరుస్తూ, కళ్లు తేలేస్తూ, చేతులూ కాళ్లూ ఆడిస్తూ. ఆ కళ్లలో స్పృహ పూర్తిగా వున్నట్టు శాంతకి అనిపించింది. పాపం! అల్లా అనుకోకూడదనుకుంది. భర్త డాక్టరుకోసం వెడితే వొచ్చేదాకా శైత్యోపచారాలు చేసింది. కూచున్నంతసేపూ శాంతకి ఒకటేమాట జ్ఞాపకం వొచ్చింది—"నాకు దేవుడూ, దెయ్యమూకూడా ఆవిడే."

నిజమే. దేవతాంశం అయిపోయి, దెయ్యంపాత్ర ప్రారంభించింది కాబోలు. పరమేశ్వరుడా ఏమిగతి? ఈ రాక్షసకొంపలో ఎల్లా ఉండడం అని శాంతహృదయం కుమిలిపోయింది.

డాక్టరు వొచ్చి మొగుడుతో ఏం చెప్పాడో ఆ నాటికీ, ఈ నాటికీ శాంతకి తెలియదు. ఆవిడ భర్తని అడగలేదు. ఆయనా చెప్పలేదు. కాని ఆ రాత్రి మొదలు పోయేవరకూ అత్తగారుపడుకున్న పక్కమీంచి లేచి కూచోడమే గాని, అందరూ చూస్తోండగా నడవ లేదు. అల్లా కూలబడిపోయింది. తన సింగారంమాత్రం మానలేదు. భోజనాది కార్యక్రమం ఆ గదిలోనే. ఇల్లు కూడా ఆవిడ అనుకూలంకోసం మార్పించి కట్టించారు. చిన్నమ్మి, కొడుకూ ఆజ్ఞ లేకుండా ఆ గదిలోకి వెళ్ళొచ్చు. కోడలుమాత్రం, కొడుకుతోపాటు పొద్దున్న కాఫీ ఆ గదిలో పుచ్చుకోవాలి. శాంతకి ఈ నాటికీ కాఫీమీద రుచిపోయింది.

ఆవిడ ఆ వేళ ఎందుకు పడిపోయింది? తనూ, కొడుకూ ఓ గదిలో ఉంటే చూసి సంతోషిద్దామనా? కాశీకి వెళ్ళినంత పుణ్యంట. చూడలేకపోయిందా? చిన్నమ్మి అనడం గుండెజబ్బంది. పదేళ్లు లేవలేని గుండెజబ్బేమిటి? కొడుకుమీద ఆపేక్ష మలుచుకోలేక పోయింది గావును. తనలోంచి పుట్టి, తనచుట్టూ ఉపగ్రహంలా తిరిగే కొడుకు మరోగ్రహంచుట్టూ తిరగడం ఇష్టం లేకపోయింది. సహించలేకపోయింది. తన ఆకర్షణ, అధికారం వృద్ధిచేసుకుని, కొడుకు ఉపగ్రహాన్ని తన వేపు లాక్కుందామని ప్రయత్నించింది. భూమికీ సూర్యుడికీ మధ్య చంద్రుడిలా వుంది రమణరావు పని. శాంతికి మాత్రం నిత్యగ్రహణాలతో కాలం వెళ్లిపోయింది. ఒక రోజా, రెండు రోజులా? పదేళ్లు. రాళ్లలాటి పదేళ్లు. సంసారసుఖం లేని, పిల్లలు లేని, సంతోషం లేని పదీ × మూడువొందలా అరవై అయిదు రాత్రుళ్ళూ, పగళ్ళూ! అబ్బ! ఎల్లా భరించింది?

ఆ తలుపుదగ్గిర నుంచుని కిరకిరశబ్దకారణం అన్వేషిస్తున్న శాంతకి ఈ పది సంవత్సరాల జీవితచర్య తలలో సినీమాలా గిర్రున తిరిగింది. తల గిరగిర తిరిగింది. వొళ్లు తూలిపోయింది. కింద పడిపోయింది.

ఆ వేళే అత్తగారి నెలమాసికం. రమణరావు ఏవో పట్టుకురావడానికి బజారు వెళ్లాడు. వంటమనిషి ఇంకా రాలేదు. చప్పుడు విని చిన్నమ్మి వొచ్చి చూసింది. ఆవిడైంది, ఇంక నీవిడా అనుకుంది. 'అమ్మమ్మో! అయ్యా కెంత కష్టం వొచ్చిం'దనుకుంది. నెమ్మదిగా శాంతని గదిలోకి తీసుకెళ్లి పడుకోపెట్టి ముఖాన్ని కాసిని చన్నీళ్లు కొట్టింది. నెమ్మదిగా ఆవిడ తెప్పరిల్లింది.

"చిన్నమ్మా! పెద్దమ్మగారు నన్ను వొదిలిపెట్ట లేదే. దెయ్యమై బాధిస్తోందే. ఆ తలుపు తెరిచి నేను ఏంచేస్తున్నానో చూస్తోందే" అంది.

"ఏంటమ్మగారూ? అన్నీ పైత్యపు మాటలూ. మాట్లాడక పడుకోండి. అయ్యగారింటే హడిలిపోతారు. ఇప్పటికైనా ఆయన్ని సుఖపడనియ్యండమ్మా"...

అంటోంటేనే కూరలసంచీ పట్టుకుని రమణరావు వొచ్చాడు. వొస్తూనే భార్యని వెతుక్కుంటూ గదిలో ప్రవేశించాడు. అతనికి ఇంకెవరున్నారు, భార్యతప్ప. అందుకనే గబగబా ఆవిడ గదిలోకి వొచ్చాడు. వొచ్చేసరికి ఈ దృశ్యం! అతను నిలువునా నీరైపోయాడు.

"భగవంతుడా, పదేళ్లు తల్లయింది. ఇప్పుడు పెళ్ళామా?" అని వాపోయాడు.

చిన్నమ్మి జరిగిందంతా చెప్పింది. చివరికి ఏడుస్తూ "పెద్దమ్మగారు దెయ్యమై పట్టుకున్నారని పలవరిస్తున్నారండీ" అంది.

అతను భరించలేకపోయాడు. ఏదో అంతా అయిపోయింది, ఇప్పటికైనా సుఖపడదామనుకుంటే ఇదేమి ఖర్మంరా అనుకున్నాడు. వెంటనే వెయ్యివూహాలతో, బాధలతో, [illegible]రువులతో, ఆడీఆడని కాళ్లతో డాక్టరు దగ్గిరికి వెళ్లాడు. డాక్టరు వొచ్చి అంతా విన్నాడు. అన్నీ పరీక్షించాడు. శాంతవొళ్లు కొంచెం వెచ్చగా ఉంది. డాక్టరుతోపాటే రమణరావుకూడా పగటివేళ ఆవిణ్ని మొదటిసారి పూర్తిగా పరీక్షించాడు. ముఖం పాలిపోయింది. గుండెలు రైలులా పరుగెత్తుతున్నాయి. డాక్టరికి ఏమీ తోచలేదు. లేడీ డాక్టర్ని పిలిపించమన్నాడు. రమణారావు వెళ్లాడు. ఈ లోగా శాంత పేలాపన ప్రారంభించింది. "అత్తయ్యా, మిమ్మల్ని నే నేం చేశాను? మనస్సులో ఏమన్నా అనుకుంటే క్షమించండి. చిన్నతనం. తెలియదు. నన్ను చూసి కాకపోయినా మీ కొడుకుసుఖంకోసమైనా మీరు ఇల్లువిడిచి వెళ్లిపోండి. మిమ్మల్ని మా మనస్సుల్లో పూజిస్తాం. అత్త

య్యాళ్ళ, నాముద్దు ఒక్కటీ చెల్లించరూ" అంటో ఏదో ఏదో అంటోంది. మాట్లాడుతోనే వుంది. విపరీతమైన వికారంతో లేచి బ్రహ్మాండంగా వాంతులు చేసుకుటోంది. వెళ్ళిపోడానికి లోపల ఆధరువు ఏమీ వున్నట్టు లేదు. లేత తమలపాకువంటి మనిషి ఆ వికారపు పట్టులో ఎర్రగా కందిపోయింది. యమబాధపడుతోంది. చిన్నమ్మి తల పట్టుకుంది.

లేడీడాక్టరూ, రమణారావూ వొచ్చారు. ఆవిడ కథంతా వింది. అత్తగారి గదితలుపు తెరిపించి అంతా పరీక్షచేసింది. తిరిగీ వొచ్చి శాంతని బుజ్జగించి ప్రసన్నం చేసుకుంది. మగడాక్టర్నీ, రమణారావునీ గదిలోంచి వెళ్ళిపొమ్మంది. తలుపేసింది. పరీక్షచేసింది. ఆవిడ పరీక్షచేస్తూండగానే శాంతకి వాంతి వొచ్చింది. ఆ పట్టు వదిలినతర్వాత డాక్టరు చిరునవ్వుతో శాంతని అడిగింది:

"అమ్మా, నీకు ఈ యిల్లు విడిచిపెట్టి వెళ్ళిపోదామని వుందా?"

శాంత పాలినముఖంలో చిరునవ్వు ఉదయించి, అవునన్నట్టు తలవూపింది.

"కూర్తాళం వెడతావా?"

"ఎందుకు?"

"అక్కడ ఆశ్రమంలో స్వామి సాన్నిధ్యంలో వుంటే ఏ దెయ్యాలూ నిన్ను బాధించలేవు."

శాంతముఖం విప్పారింది. "వెడతాను" అంది.

"తీసుకెళ్ళమని మీ వారితో చెప్పనా?"

"చెప్పండి"

"అంతేనా నీ రుగ్మత?"

శాంత తల వూపింది.

డాక్టరు తలుపు తీసింది. అవతలికి వెళ్ళి, మగడాక్టర్నీ రమణారావునీ పిలిచి దూరంగా తీసుకెళ్ళింది. ఆదుర్దాతో రమణారావు చేతులు జోడించుకుని వింటున్నాడు.

"అపాయం ఏమీ లేదుగదా?"

"త్వరలో మేలుకున్నారుగనక లేదు"

"జబ్బేమిటి?"

"కొంచెం గ్రహసంబంధమైనదే"

రమణారావుకి కోపం వొచ్చింది. వొళ్లు మండిపోయింది. "మీరు భూతవైద్యులా?" అన్నాడు కోపం బిగపట్టుకొని.

"అవసరం వొస్తే"నని డాక్టరు చిరునవ్వు నవ్వింది.

మగ డాక్టరు తెల్లబోతున్నాడు.

అప్పుడు లేడీడాక్టరు చెప్పింది: "నిజమేనండీ. ఆవిణ్ణి మీదోషం ఆవేశించింది. మీ అమ్మగారో, మీ నాన్నగారో ఎనిమిదినెలలదాకా చెప్పడానికి వీల్లేదు. వెంటనే స్థలంమార్చి కూర్తాళం తీసుకెళ్ళండి."

మగడాక్టరు పొట్టచెక్కలయేటట్టు నవ్వడం ప్రారంభించాడు.

రమణారావుభార్య గదితలుపు తోసుకుని వెడుతోంటే అది కిరకిరలాడింది.